01ATP17F_01ATP17F.qxd 17-11-2024 PM 10:31 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 18 నవంబర్ 2024 పేజీలు : 04

బాబు హయాంలో శంకుస్థాపనలకే హంద్రీనీవా పరిమితం

- రాయలసీమ డిక్లరేషన్ బిజెపి హామీ ఏమైంది
- ఏపి అంటే అమరావతి, పోలవరమేనా..
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, నవంబర్ 17 ప్రభాతవార్త

రాయలసీమ వాసిగా చెప్పుకునే చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు శంకుస్థాపనలకే హంద్రీనీవాను పరిమితం చేశారని, దివంగత నేత వైఎస్ఆర్ సీఎం అయ్యాక హంద్రీనీవా పనులు చేపట్టి 2012 నుంచి కృష్ణ జలాలు రాయలసీమకు తీసుకురాగలిగారన్నారు. నేడు కరువు ప్రాంతమైన రాయలసీమకు హంద్రీనీవా జలాలు వస్తున్నాయంటే అది దివంగత నేత వైఎస్ఆర్ చలవేనని గుర్తు చేశారు. హంద్రీనీవా లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను రాత్రికి రాత్రి పట్టి సీమకు తరలించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. హంద్రీనీవా సామర్థ్యం 3,850 క్యూసెక్కులు ఉంటే ప్రస్తుతం 2,200 క్యూసెక్కులు వస్తున్నాయన్నారు. 6200 క్యూసెక్కులు సామర్థ్యానికి గతంలోని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జీవో జారీ చేసిందని, నేడు మళ్లీ కూటమి ప్రభుత్వం 3,850 క్యూసెక్కులకే పరిమితం చేస్తున్నారని, దీని వల్ల రాయలసీమకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అనంతపురంకు వచ్చిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళగిరికి తీసుకెళ్లారని, తిరుపతి క్యాన్సర్ ఆసుపత్రిని కోస్తా జిల్లాలకు తరలించారని, నేడు మరోమారు కర్నూలులో ఉన్న లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను తరలించే ప్రయత్నం చేస్తుండటం సరైన విధానం కాదన్నారు. ఏపి అంటే అమరావతి, పోలవరం మాత్రమేనా చంద్రబాబు దృష్టిలో అని ఆయన ప్రశ్నించారు. అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి చెందక పోతే ప్రాంతీయ అసమానతలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా మరోమారు రాష్ట్రాల విభజన ఉద్యమాలకు ఆస్కారం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి వికేంద్రీకరణకు దిశగా చంద్రబాబు కృషజ చేయాలని ఆయన సూచించారు. విలేకర్ల సమావేశంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షులు చింతాసోమశేఖర్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఎద్దుల అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనలో కురుబల పాత్ర ఎంతో ఉంది: మంత్రి సవిత

కురుబల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సవిత

అన్నావదినలకు నూతనవస్త్రాలు అందిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ నవంబర్ 17 ప్రభాతవార్త

ఆధ్యాత్మిక చింతనలో గురువుల పాత్ర ఎంతో ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జోలి శాఖ మంత్రి కురుబ సవిత అన్నారు మండలములోని అనుమప్ప పల్లి గ్రామంలో ఆదివారం జరిగిన తాళికేరప్ప ఉజ్జినప్ప స్వాముల పెద్దపరస మహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కురుబ కులస్తులు ఆధ్యాత్మిక చింతనలో ఉంటూ నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలుస్తున్నారు . కురబలు జీవనం సాగిస్తూనే సమయానకాలం ఆధ్యాత్మిక చింతనలో మునిగితేలుతుంటారన్నారు కురుమ కులస్తులకు తాళికేరప్ప ఉజ్జినప్ప స్వాములు అత్యంత ప్రాముఖ్యత కలిగిన స్వాములగా పేర్కొన్నారు గ్రామంలో ఆదివారం తాళికేరప్ప ఉజ్జినప్పల స్వాముల ఉత్సవం ను అంగరంగ వైభవంగా నిర్వహించారు గణపతి పూజ సంప్రోక్షణ పుణ్య వాచనం వంటి పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు పటాలు పోయుట గురవయ్య లకు పాలు పోయుట వంటి కులచార సాంప్రదాయ కార్యక్రమాలు చేపట్టారు తదనంతరం తీర్థ ప్రసాద వినియోగం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడ్డాయి మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లానలుమూలలనుండి వేలాదిమంది కురువ కులస్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలలో రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు తెలుగుదేశం నాయకులు నాగరాజు రెడ్డి పాల్గొన్నారు

హెచ్ఆర్‌సి, యంయస్‌యంఇ మెగా పార్క్, లోకాయుక్తలను తరలించరాదు

- హైకోర్టు, న్యాయ అకాడమీల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి నేతలు డిమాండ్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వివిధ రంగాలకు చెందిన మేధావులు

అనంతపురం, నవంబర్ 17 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సి), కడప జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన కొప్పర్తి యంయస్‌యంఇ మెగా పార్క్, లోకాయుక్తలను అమరావతికి తరలించడాన్ని రాయలసీమ ప్రాంత రాజకీయ పార్టీలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి నేతలు, సిపిఐ నేతలు, వివిధ రంగాలకు చెందిన మేదావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చర్చించారు. ఈ చర్య శ్రీభాగ్ రాయలసీమ హక్కుల పత్రం స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి, అధికార వికేంద్రీకరణ ద్వారానే ప్రాంతాల మధ్య అసమానతలు తొలగిపోతాయని, శ్రీభాగ్ ఒప్పందం, శ్రీకృష్ణ, శివరామకృష్ణన్, బోత్సవ్ లాంటి మేధావులు కమిటీ నివేదికలు ఇదివరకే చెప్పి ఉన్నాయి. రాష్ట్రం చీలిపోయిన తర్వాత ఏపిలో వెనుకబడిన ప్రాంతాల పరిస్థితి, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన రాయలసీమ పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు అయిందన్నారు. నీళ్లు, నిధులు నిరుద్యోగ సమస్యలతో అతలాకుతలమవుతోందన్నారు. రైతుల ఆత్మహత్యలు కూలీల వలసలు విపరీతంగా పెరిగి పోయినాయన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు మొదటగా అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం, అమరావతి అభివృద్ధి యావత్తు రాష్ట్ర అభివృద్ధిగా ముందుకు పోయింది. తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాదు కదా అమరావతి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నిలిచిపోయిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే ప్రయత్నం చేసింది కానీ తగినంత సమయం, కావాల్సినంత డబ్బు, కోర్టులలో వ్యాఖ్యాలు వల్ల పూర్తిగా కార్యరూపం దాల్చలేదన్నారు. వికేంద్రీకరణలో భాగంగా శ్రీభాగ్ ఒప్పందానికి కట్టుబడి వైసీపీ ప్రభుత్వం రాయలసీమలోని కర్నూలులో హైకోర్టును, న్యాయ అకాడమీ, లోకాయుక్త, హెచ్ఆర్‌సిలను ఏర్పాటు చేయాలని ప్రయత్నంలో భాగంగా లోకాయుక్త, హెచ్ఆర్‌సిలను ఏర్పాటు చేసిందన్నారు. మిగిలిన హైకోర్టు, న్యాయ అకాడమీల ఏర్పాటు కోసం కావాల్సిన స్థల సేకరణ కూడా పూర్తి చేసింది. అంతలోనే కొంత మందికోర్టులలో వ్యాజ్యం వేసి అడ్డుకున్న కారణంగా హైకోర్టు, లా అకాడమీ ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు. నేడు తిరిగి అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం వెనుకటిలాగే అమరావతి అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అనే నినాదంలో భాగంగా ఉన్నఫలంగా కర్నూలులో ఏర్పాటు చేసిన హెచ్ఆర్‌సి, లోకాయుక్తలను, కడప జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేసిన కొప్పర్తి, యంయస్‌యంఇ మెగా పార్కులను అమరావతికి తరలించడానికి పూనుకోవడం రాయలసీమ వ్యతిరేక చర్య అన్నారు. ఈ చర్యను రాయలసీమ వాసులు ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు హంద్రీ-నీవా, గాలేరు-నగరి, ప్రాజెక్టును, అనంతపురం జిల్లా లాంటి ఎడారి జిల్లాలకు ప్రాణప్రదమైన హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సత్వరం పూనుకోవాలి. లేకుంటే ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగిపోతాయి. ప్రత్యేక రాయలసీమ నినాదం బలపడే ప్రమాదం ఉంది. కావున కూటమి ప్రభుత్వం హెచ్ఆర్‌సి, లో కాయుక్తలను రాయలసీమ హక్కుగా భావించి అమరావతికి తరలించడాన్ని వెంటనే ఆపాలి, చంద్రబాబు శ్రీశైలంలో చెప్పిన విధంగా రాయలసీమను రతనాల సీమ వైపు తీసుకుపోయి, రాష్ట్రం మరో సారి చీలకవైపు వెళ్లకుండా చూడాలి. ఈ ప్రాంత ప్రజల ఆవేదన, అసహనాన్ని గమనించాలి, లేకుంటే మరొక్కసారి రాయలసీమ ఉద్యమం ఉవ్వెత్తున లేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి నేతలు కెవి.రమణ, జి.నాగన్న, ఆర్.రామకృష్ణరెడ్డి, ఎం.వెంకటేసులు, బి.రాజేష్, శ్రీనివాసులురెడ్డి, నాగలింగయ్య, సిపిఎం నేతలు బాలరంగయ్య, టి.రామాంజినేయులు, చామలూరు రాజగోపాల్, సి.సోమశేఖర్‌రెడ్డి, జలసాధన సమితి ఆర్.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో తొలిసారిగా లంగ్ టాక్స్

- కిమ్స్ సవేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఒకరోజు సదస్సు - ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

హాజరైన వైద్యులు, వైద్య, పిజి విద్యార్థులు

అనంతపురం కలెక్టరేట్, నవంబర్ 17 ప్రభాతవార్త

రాయలసీమ ప్రాంతంలో తొలిసారిగా ఊపిరితిత్తుల సమస్యలపై వైద్యనిపుణుల్లో అవగాహన కోసం లంగ్ టాక్స్ అనే సదస్సును నిర్వహించారు. ఆదివారం కిమ్స్ సవేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని అలెగ్జాండర్ లగ్జరీ హోటల్‌లో నిర్వహించిన ఈ సదస్సును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లంగ్ టాక్స్ సదస్సుకు రావడం చాలా సంతోషంగా వుందన్నారు. ఈ సదస్సును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు వారి విధి నిర్వహణతో పాటు సేవాభావంతో కూడా పనిచేయాలని, మారుమూల ప్రాంతాల్లోని వారికి వైద్యసేవలు అందించాలన్నారు. సాధారంగా ఊపిరితిత్తుల సమస్యలు వచ్చాయంటే హైదరాబాద్ లేదా బెంగుళూరుకు చికిత్సల కోసం వెళతారని, కానీ ఆయా నగరాలకు ధీటుగా రాయలసీమలోని అనంతపురంలో కూడా అత్యాధునిక సదుపాయాలు వున్నాయని ఈ సదస్సు ద్వారా వైద్యులకు కూడా తెలియచేశారు. ఈ సదస్సులో ప్రధానంగా ఊపిరితిత్తుల్లో వచ్చే పలు రకాల సమస్యలు, వాటికి నిర్ధారణ పరీక్షలు, చికిత్స విధానాలపై ఇందులో విస్తృతంగా చర్చించారు. ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్, క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, తదితర సమస్యలు ఎందుకు వస్తాయి. వాటి నిర్ధారణకు ఎలాంటి పరీక్షలు వున్నాయనే అంశంపై జనరల్ ఫిజిషియన్లు, పల్మనాలజిస్టులు, ఎనస్టీషియాలజిస్టులు, క్రిటికల్ కేర్ విభాగం నిపుణులు, పీజీ విద్యార్థులు, తదితరులకు అవగాహన కల్పించారు. ఇలాంటి సంక్లిష్టమైన సమస్యలు వున్నప్పుడు ఊపిరితిత్తులు బాగా దెబ్బతింటే వెంటిలేటర్ అమర్చడంలో ఆధునిక విధానాలు, ఎక్మో ఎప్పుడు, ఎలా ఎన్నాళ్లు ఉపయోగించాలనే విషయాలు చర్చించారు. ఇందులో ప్లెక్సిబుల్, రిజిడ్ బ్రాంకోస్కోప్, ఎండోబ్రాంకియల్ అల్ట్రా సౌండ్, రేడియల్, లీనియల్, క్రయోథెరిఫీ, థొరాకోస్కోపీ, వెంటిలేటర్ స్కాలర్ ఇంటర్‌ప్రెటేషన్ తదితర విధానాలను ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రుల సిఎండి డాక్టర్ బొల్లిపల్లి భాస్కర్‌రావు, కిమ్స్ సవేరా ఆసుపత్రి ఎండి ఎస్‌వి కిషోర్‌రెడ్డిల మార్గదర్శకత్వంలో ఈ సదస్సు జరిగింది. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ పల్మనాలజిస్టు డాక్టర్ ఎన్.శంభకర్, కిమ్స్ సవీరా ఆసుపత్రికి చెందిన డాక్టర్ యశోవర్ధన్ మంగిశెట్టి, డాక్టర్ రవిశంకర్, తదితరులు వివిధ వైద్య విధానాలు, ఊపిరితిత్తుల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్దసంఖ్యలో పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, పీజీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడు సేవల్ని పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది

- అన్నకు అండగా.. పార్టీ కోసం అహర్నిశలు పని చేశారు
- రామూర్తినాయుడుని కోల్పోవడం బాధగా ఉంది అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, నవంబర్ 17 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు , చంద్రగిరి మాజీ ఎమ్మెలే్య నారా రామ్మూర్తి నాయుడు సేవల్ని తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపి నాయకులు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు అర్బన్ టిడిపి కార్యాలయంలో రామ్మూర్తి నాయుడుకి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ.. రామ్మూర్తినాయుడు పార్టీ కోసం ఎంతో సేవ చేశారన్నారు. ఒక ముఖ్యమంత్రి సోదరుడిగా ఉండి కూడా ఆయన ఎక్కడా ఆ దర్పం చూపకుండా సామాన్య నాయకుడిలానే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కార్పోరేటర్ సరిపూటి ర మణ, టిడిపి సీనియర్ నాయకుడు నారాయణస్వామి యాదవ్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని, టిడిపి నాయకులు ఈడిగ నాగభూషణం, రామకృష్ణనాయుడు, గుడుపుటి వెంకటేష్, సిరిసాల రాంబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం శ్రమించిన నాయకుడు రామ్మూర్తినాయుడు : ఎమ్మెల్యే దగ్గుపాటి

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడుని పార్టీ కోసం ఎంతో శ్రమించారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆయన మరణ వార్త తెలిసినప్పుడు చాలా బాధ కలిగిందన్నారు. అయ్యప్ప మాలలో ఉన్నందున ఆయన భౌతిక కాయాన్ని సందర్శించ లేక పోతున్నానన్నారు. చంద్రబాబునాయుడుగా ఉన్నప్పటికీ ఎప్పుడూ ఆయన ఆడిపత్యం చూపలేదన్నారు. అందరిలానే కనిపించారన్నారు. అందుకే ఆయన నిరాడంబరుడని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రత..!

- గణనీయంగా తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు - తెల్లవారుజామున కమ్ముకొంటున్న పొగమంచు

కిటికిటలాడుతున్న టీ దుకాణం

ఆర్టీసీ బస్టాండ్‌లో కమ్మేసిన పొగమంచు

ఉరవకొండ, నవంబర్ 17 ప్రభాతవార్త

చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతల్లో పెను మార్పులు చోటు చేసుకొంటున్నాయి. సాయంత్రం, తెల్లవారుజాము సమయాల్లో పొగమంచు దట్టంగా కమ్ముకొంటోంది. ఆదివారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో ఎదురుగా వస్తున్నదెవరో కూడా గుర్తుపట్టని పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణ శివారు అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉదయం 10 గంటలైనా సూర్యుడు మబ్బులోంచి బయటకు రావడంలేదు. చలి తీవ్రత నేపథ్యంలో టీ స్టాళ్లవద్ద జనం గుంపులు గుంపులుగా కనిపిస్తున్నారు. తెల్లవారుజామున సమయాల్లోనే రోడ్లపైకి వచ్చి ఆకుకూరలు, కూరగాయాలు, పాలు, పండ్లు అమ్మే చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంటింటికీ తిరిగి వార్తా పత్రికలను చేరవేసే పేపర్ బాయ్స్ చలికి వణుకుతూనే తమ విధులు నిర్వహిస్తున్నారు. రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో కూలీలతో సేద్యం పనుల కోసం పొలాలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. కాగా వాతావరణంలో మార్పుల కారణంగా నూటికి 60శాతం మంది జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతుండగా ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

బాబా జయంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి టౌన్ నవంబర్ 17 ప్రభాతవార్త

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు నేటి నుంచి ఈ నెల 24 వరకు ఘనంగా జరగనున్నాయి. సోమవారం వేణుగోపాల స్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభం కావడం ఆనవాయితీగా వస్తోంది. వేణుగోపాల స్వామి గుడి నుంచి గోపురం గేటు వరకు రథం వేణుగోపాల స్వామిని ఊరేగించనున్నారు. ఈ రథోత్సవానికి దేశ విదేశాల భక్తులతో పాటు పుట్టపర్తి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనున్నారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు ప్రశాంతి నిలయంలో ఉచిత అన్న ప్రసాదములు పంపిణీకి ట్రస్టు అన్ని ఏర్పాట్లు చేపట్టింది. 19న మహిళా దినోత్సవం, 22న సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుగుతుంది. 20, 21న జాతీయ సేవాదళ్ సభ్యుల సమావేశాలు, 23న సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను హిల్వ్ స్టేడియంలో జరగనున్నాయి. స్నాత్కోత్సవానికి, జయంతి వేడుకలకు ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి భక్తులు, సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నియానికి చేరుకున్నారు. వేడుకల్లో పాల్గొనే విఐపి లకు ట్రస్ట్ వర్గాలు తగిన ఏర్పాట్లు చేపట్టింది. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ వారం రోజుల నుంచి పారిశుద్ధ్య పై దృష్టి పెట్టి పట్టణం పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు చేపట్టారు. ఆర్టీసీ వారు ఈ వేడుకలకు 100 బస్సులు సమకూర్చనున్నారు. ప్రభుత్వపరంగా తగు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం పరంగా చేపడుతున్న పనులను సోమవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పర్యవేక్షించారు.

ఐక్యతతో అభివృద్ధి సాధించవచ్చు

సమావేశంలో పాల్గొన్న విలేకరులు

పెనుకొండ నవంబర్ 17 ప్రభాత వార్త

విలేకరుల ఐకమత్యంతో ఉంటూ అభివృద్ధి సాధించుకోవచ్చని సీనియర్ జర్నలిస్టులు బీరే ఈశ్వర్ పంచాంగం శివప్రసాద్ కే రామకృష్ణ లు అన్నారు. పట్టణంలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆదివారం జరిగిన ఏపీ యు డబ్ల్యూ జె సమావేశంలో వారు మాట్లాడారు జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లా నియోజకవర్గ మండ లాల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు జర్నలిస్టులకు అక్రిడేషనల్ తో పాటు ఇంటి స్థలాలు ప్రైవేట్ కళాశాలలో 50 ఫీజు రాయితీ హెల్త్ కార్డుల పంపిణీ బస్సుల పాస్ లు ఇప్పించడం హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు కట్టించడం పక్క గృహాల నిర్మాణం వంటి వాటితో పాటు రాష్ట్ర స్థాయిలో వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు యూనియన్ చేపట్టడం జరుగుతుందన్నారు యూనియన్ సభ్యత్వం పొందాలన్నారు విలేకరులకు ఎలాంటి ఆపదలు సంభవించిన వేళల్లో యూనియన్ అండగా నిలబడుతుంద ని అన్నారు సమావేశంలో పెనుకొండ నియోజకవర్గ కమిటీ ఈనెల 26న జిల్లా అధ్యక్షులు పుల్లయ్య ఆధ్వర్యంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు 26వ తేదీన జరిగే సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని రొద్దం పరిగి పెనుకొండ సోమందేపల్లి గోరంట్ల మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పిడిఎఫ్ పత్రికలు యూట్యూబ్ ఛానల్స్ జర్నలిస్టులు పాల్గొనాలని పిలుపునిచ్చారు సమావేశంలో సీనియర్ పాత్రికేయులు ఆదినారాయణ నారాయణరెడ్డి మహేష్ నారాయణ గోవిందు బాబా ఫక్రుద్దీన్ శివ మస్తాన్ లు పాల్గొన్నారు

రామ్మూర్తి నాయుడు అంతక్రియల్లో పాల్గొన్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

రామ్మూర్తినాయుడు అంత్యక్రియలో పాల్గొన్న ఎంఎస్ రాజు

మడకశిర నవంబర్ 17 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు సోదరుడు స్వర్గీయ రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు వారి స్వగ్రామమైన నారావారి పల్లెలో అధికార లాంఛనాలతో ఆదివారం జరిగాయి. మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ సభ్యులు ఎంఎస్ రాజు సహచర ఎమ్మెల్యేలతో కలిసి రామ్మూర్తి నాయుడు అంతక్రియల్లో పాల్గొన్నారు ఇందులో భాగంగా చంద్రగిరి మాజీ శాసన సభ్యులు స్వర్గీయ రామ్మూర్తి నాయుడు తనయుడు సినీ హీరో నారా రోహిత్ మరియు వారి కుటుంబ సభ్యులను ఎం.ఎస్ రాజు పరామర్శించారు.

వైభవంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

వాల్మీకి మహర్షికి పూజలు నిర్వహించిన దృశ్యం

అమరాపురం, నవంబర్ 17 ప్రభాతవార్త

మండలంలోని హలుకూరు గ్రామంలో ఆదివారం వాల్మీకి సోదరులు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మహర్షి వాల్మీకి విగ్రహానికి అభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్సి గుండుమల తిప్పేస్వామి హాజరై వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన ప్రముఖులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎంఎల్సి మాట్లాడుతూ మహర్షి వాల్మీకి అడుగుజాడల్లో నడిచి సమాజానికి ఉపయోగపడాలన్నారు. అదేవిధంగా పిల్లలను బాగా చదివించి సత్ప్రవర్తన కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, తెలుగుయువత ఉపాధ్యక్షులు రఘు, టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, మీడియా కో ఆర్డినేటర్ రవికుమార్, తాలూకా బిసి సెల్ ఉపాధ్యక్షులు మంజుతారక్, నాయకులు మారుతిప్రసాద్, దాదాపీర్, డీలర్ల సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి ఎస్సి సెల్ అధ్యక్షులు చన్నప్ప, పట్టణ అధ్యక్షులు నాగరాజు, ప్రకాష్, స్టూడియో హనుమంతు, వివేక్, చంద్రశేఖర్‌గౌడ్, వాల్మీకి సంఘం నాయకులు నాగరాజు, డీలర్ హేమంతరాజు, సిద్ధేశ్వర, ప్రభాకర్, రంగస్వామి, శ్రీరామ్, దేవేంద్రప్ప, దివాకర్, అమర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తలారి సిద్ధేశ్వర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీశనీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంఎల్సి



సన్మానం చేస్తున్న దృశ్యం

అమరాపురం, నవంబర్ 17 ప్రభాతవార్త

మండలంలోని ఆలదపల్లి గ్రామంలోని శ్రీశనీశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఆదివారం మాజీ ఎంఎల్సి గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేషపూజల్లో మాజీ ఎంఎల్సి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో దీక్షహోమం, దేవతామూర్తుల విగ్రహస్థాపన, ప్రధాన దేవతాహోమాది కార్యక్రమాలు, పుణ్యాహదీక్ష హోమం, కలశస్థాపన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు దేవాలయం కమిటీ సభ్యులు గ్రామ యువకులు పాల్గొన్నారు. శ్రీశనీశ్వరస్వామి దేవాలయాన్ని బృహత్తర సంకల్పంతో దాదాపు 80 లక్షల రూపాయలు వెచ్చించి భారీ దేవాలయాన్ని నిర్మించిన ఆలదపల్లి గ్రామ ప్రజలను మాజీ ఎంఎల్సి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, బిసి సెల్ తాలూకా ఉపాధ్యక్షులు మంజుతారక్, మారుతిప్రసాద్, స్టూడియో హనుమంతు, డీలర్ తిప్పేస్వామి, నాగరాజు, మాజీ సర్పంచులు పాంగురంగప్ప, చంద్రప్ప, ఆలయ కమిటీ సభ్యులు గిరిగౌడ, గిరిరాజు, వీరశేఖర్, యంజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే అయ్యప్ప భక్తులకు అన్నదానం

- కమిటీ చైర్మన్ డిఇ రమేష్

కరపత్రికలు విడుదల దృశ్యం

హిందూపురం టౌన్, నవంబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని బెంగళూరు రోడ్డు లో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం అన్నదాన భవనంలో అయ్యప్ప స్వామి దీక్ష దారులకు, మిగతా దేవతల దీక్షాదారులకు అన్నదానం రేపటి నుండి 48 రోజులు పాటు జనవరి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ అధ్యక్షులు డిఇ రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం నాడు శ్రీ అయ్యప్ప దేవాలయం నందు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారం, సేవకుల సేవాభావంతో ఇప్పటికి 14 సంవత్సరాలుగా విజయవంతంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రోజుకు 800 నుండి రోజు రోజుకు పెరుగుతూ 1200 దాకా భక్తాదులు అయ్యప్ప అన్నదాన కార్యక్రమంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారని వివిధ ప్రాంతాల నుండి వారి వారి పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన భక్తాదుల సౌకర్యార్థం ప్రతిరోజు మధ్యాహ్నం 1:00 గంట నుండి 2: 30 వరకు అన్నదానం ఉంటుందని చెప్పారు. మాలధారణ భక్తాదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వామి రవి టాగూర్, ఉపాధ్యక్షులు వాల్మీకి చిరంజీవి, భగీరథి నవీన్, నారాయణప్ప, కొండయ్య, ఆటో సంజీవ, నరసింహులు, వెంకటేష్, శ్రీరాములు, నాగేంద్ర, సుబ్రమణ్యం, అర్చకులు పవన్ పాల్గొన్నారు.

ఆహుడా చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

బహుమతి ఇస్తున్న రాము

హిందూపురం టౌన్, నవంబర్ 17 ప్రభాతవా ర్త

అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా నియమితులైన జనసేన పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు వరుణ్ ను ఆ పార్టీ హిందూపురం నాయకులు నిమ్మకాయల రాము మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా బహుమతిని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయంలో కవుల సమ్మేళనం

సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం, నవంబర్ 17 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలో గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా గ్రంథాలయంలో కవుల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రానికి చెందిన నన్నయ, తిక్కన, ఎర్రన, తదితర రచయితల గురించి వారి యొక్క సందేశాలను విద్యార్థినీ, విద్యార్థులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలింగప్ప, యోగా మాస్టర్ కిషోర్, మహంతేష్, గ్రంథాలయ అధికారి సి.ఇబ్రహీం, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనము, సెమినార్లు

మాట్లాడుతున్న రచయిత దాసిరెడ్డి

కనగానపల్లి నవంబర్ 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం సమ్మేళనము నందు గ్రంథాలయం పై కవితలు , కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన మరియు తెనాలి రామకృష్ణ వారి సాహిత్యాన్ని తెలియజేశారు. సెమినార్లు, రచయితల సందేశాలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా దాసి రెడ్డి అంతే తిప్పయ్య నాగభూషణం రిటైర్డ్ గ్రంథాలయ అధికారి పుల్లన్న , మురళి లు ప్రసంగిస్తూ తెలుగు సాహిత్యము, తెలుగు ప్రాధాన్యత గురించి సభకు వచ్చిన వారికి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి, డి. గోవిందు గ్రంథాలయ సిబ్బంది వన్నూరప్ప విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు...

బురదగుంత కాదు తారు రోడ్డు రహదారే నమ్మండి ప్లీజ్

గుంతల మయంగా ఉన్న రహదారి తారు రోడ్డు

కనగానపల్లి నవంబర్ 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బీసీ కాలనీ టు శివాలయం వద్ద ఆర్ అండ్ బి రహదారి తారు రోడ్డు గుంతలు పడిపోవడంతో ఇటీవల మట్టితో ఆ గుంతలు అధికారులు పూడ్చి వేయించారు. కానీ ఇటీవల కురిసిన వర్షానికి ఆ రహదారి పెద్ద బురద గుంత గా మారింది. ఈ రహదారి గుండా వాహనదారులు ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రోడ్డు సైడ్ పక్కన నివాసం ఉంటున్న వారికి దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపడుతున్న రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమం కింద అయినా 40 మీటర్లు లో పాడైపోయిన తారు రోడ్డు మీద ప్యాచ్ వర్క్ వేయాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

బాబా జయంతి వేడుకలకు పటిష్ట భద్రత

- ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు
- డిఎస్‌పి విజయ్‌కుమార్

పుట్టపర్తి, నవంబర్ 17, ప్రభాతవార్త

భగవాన్ సత్య సాయిబాబా 99 జయంతి వేడుకలకు ప్రముఖులు, దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి వి.రత్న ఆదేశాల మేరకు పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాట్లు చేసినట్లు పుట్టపర్తి డిఎస్‌పి విజయ్‌కుమార్ తెలియజేశారు. ఈనెల 18 నుండి 24 వరకు జరుగునున్న సత్య సాయి బాబా జయంతి వేడుకలకు వచ్చే వివిఐపి, వీఐపీలు, దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు కోసం పోలీస్ శాఖ చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లు తదితర విషయాలపై ట్రస్టు, వారితో చర్చించారు. 18న రథోత్సవం, 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 20, 21న గ్లోబల్ కౌన్సిలింగ్ కార్యక్రమాలు, 22న సత్యసాయియూనివర్శిటీ స్నాతకోత్సవం పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. సోమవారం రథోత్సవం సందర్భంగా, సత్తెమ్మ గుడి నుండి గోపురం గేటు వరకు సాగే ఈ కార్యక్రమానికి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా డైవర్షన్ చేయడం జరిగిందన్నారు. 18న జరిగే రథోత్సవ సందర్భంగా కొత్తచెరువు, అనంతపూర్ , ధర్మవరం గోరంట్ల, బెంగళూరు వైపు నుండి వచ్చే వాహనాలన్నీ గణేష్ సర్కిల్ నుండి చిత్రావతి వైపు మళ్లింపులు చేపట్టడం జరిగిందని, అదేవిధంగా నల్లమాడ, కదిరి బుక్కపట్నం వైపు నుండి వచ్చే వాహనాలు కూడా చిత్రావతి వైపు నుండి గణేష్ సర్కిల్ మీదగా మళ్లించడం జరిగిందన్నారు. 21 నుండి 23 వరకు... అనంతపురం ,కొత్తచెరువు, బెంగళూరు గోరంట్ల,వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ సూపర్ స్పెషాలిటీ నుండి బ్రాహ్మణపల్లి ఎనుములపల్లి చిత్రావతి వైపు ట్రాఫిక్ ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. బాబా జయంతి వేడుకలకు వచ్చే భక్తులు సమీప ప్రాంతాల ప్రజలు అందరూ వీటిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ను పోలీస్ సెక్యూరిటీ కార్యాలయంలో వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని,పోలీస్ చెక్పోస్టులు, ఆర్టీసీ బస్టాండ్ ,గణేష్ సర్కిల్, హరిత గేట్ ,వెస్ట్ గెట్, సత్తమ్మ గుడి, వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. హనుమాన్ టెంపుల్, ఎనుములపల్లి వద్ద ఔట్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ వేడుకల్లో అపరిచిత వ్యక్తుల నుండి ఎటువంటి చోరీలు పిట్ ప్యాకెట్లు దొంగతనాలు జరగకుండా 14 ప్రత్యేక పోలీస్ టీం లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ వేడుకలకు పోలీసుల పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సత్యసాయి బాబా జయంతి వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్‌పి తెలియజేశారు.

ఫిర్యాదుదారులు వ్యక్తిగత ఆధార్ కార్డు తప్పనిరిగా తీసుకురావాలి

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి వచ్చే అర్జీదారులు తప్పనిసరిగా తమ వ్యక్తి గత వివరాలు, ఆధార్ కార్డులను తీసుకురావాలని జిల్లా ఎస్‌పి వి.రత్న ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ విషయం అందరూ గమనించి తమ ఆధార్ కార్డుతో పాటు వ్యక్తిగత ఫోన్ నెంబర్‌ను అర్జీకి తప్పనిసరిగా జతచేయాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుక్కపట్నం,నవంబర్ 17 ప్రభాతవార్త

బుక్కపట్నం మండలం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న టీడీపీ కార్యకర్త తలమర్ల శేఖర్ తల్లి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అక్కడికి విచ్చేసి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలు బౌతికాయనికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బాధలో ఉన్న ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధలో ఉన్న ఆ కుటుంబానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జలశుద్ధి కేంద్రం పునఃప్రారంభం

నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నేతలు

రామగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి రామమూర్తి నాయుడు చేతులు మీదుగా నసనకోట గ్రామంలో జలశుద్ధి కేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచు హెచ్.లలితమ్మ వైస్ చైర్మన్ జె.గంగాధర్‌తోపాటు గ్రామంలోని టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

కవి సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్, నవంబర్ 17 ప్రభాతవార్త

ఘనంగా గ్రంథాలయంలో కవి సమ్మేళనం కార్యక్రమం గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, పాఠకులు విద్యార్థుల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ నగర్‌లో గల ప్రధాన గ్రంథాలయ శాఖలో ఈ నెల 14వ తేది నుంచి 20వ తేది వరకు జరుగు గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె నిర్వహిస్తున్నారు. 4వ రోజు వారోత్సవాలలో భాగంగా కవి సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవి జే.నాగరాజు హాజరు కావడం జరిగింది. తదుపరివారు గ్రంథాలయం గురించి పద్యం రూపంలో పాఠకులకు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కూడా ఈ కవి సమ్మేళనంలో పాల్గొని తమదైన శైలిలో కవిత్వంను పాడారు. వక్తృత్వపులో చంద్రయాన్ టు గురించి వివరించడం జరిగిందని తెలిపారు.

ఈ వక్తృత్వపు పోటీలకు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణనాయక్, గంగాధర్, కవులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త

రామగిరి మండలం, వెంకటాపురం గ్రామంలోని నివాసంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి గ్రంథాలయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామని దర్శించుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి మండలం, నసనకోట సమీపంలోని తిరుమల దేవర దేవస్థానంలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని, శ్రీ ఆంజనేయస్వామిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దర్శించుకున్నారు.

కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్

పుట్టపర్తి టౌన్ నవంబర్ 17 ప్రభాతవార్త

పుట్టపర్తి పట్టణ సమీపంలో గల సంస్క్ృతి స్కూల్ ఆఫ్ బిజినెస్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని ఎస్ ఎఫ్ ఐ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థి తల్లిదండ్రులు శ్రీనివాసులు, శాంతమ్మతో పాటు ఎస్ ఎఫ్ ఐ నాయకులు పవన్, బాబావలి పుట్టపర్తి డిఎస్పీని కలసి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత మూడు రోజుల క్రితం ఎం బీ ఏ కాలేజీలో బిటెక్ చదువుతున్న హిందూపురం కు చెందిన ప్రేమ సాయి అనే విద్యార్థి గొడవల మధ్య మృతి చెందడం తెలిసిందే. కాలేజీ క్యాంపస్ లో గొడవ జరిగినప్పుడు యాజమాన్యం తగిన చర్యలు తీసుకొని ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి ఉంటే బ్రతికేవాడని ఎస్ ఎఫ్ ఐ నాయకులు పేర్కొన్నారు. యాజమాన్యాల అధిక ఫీజులు వసూలు చేస్తు నిర్వాహకులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ నాయకులు మాట్లాడుతూ పుట్టపర్తి డిఎస్పి ని కలసి యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అంతేగాక ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో కదిరి,హిందూపురం డిఎస్పి లకు వినతి పత్రాలు సమర్పించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ లక్షలు పెట్టి తమ కుమారుని కాలేజీకి పంపితే ఎదిగిన కొడుకు తన బంగారు భవిష్యత్తు పోగొట్టుకొని తమకు దుఃఖం మిగిల్చినాడని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాన్ని నమ్మి కాలేజీకి పంపితే కాలేజీ క్యాంపస్ లోనే గొడవ జరిగితే యాజమాన్యం పట్టించుకో కపోతే విద్యార్థుల భద్రత ఎంతవరకు ఉంటుందని ప్రశ్నించారు. తమ కొడుకు మృతి పట్ల పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకునే వరకు ఆందోళనలు చేపడతామన్నారు.

గతంలో ఏఈల అవినీతి..

- అందుకే మండలానికి కొత్తవారు రావడానికి జంకు
- 8 నెలలుగా ట్రాన్స్‌కో ఏఈ పోస్టు ఖాళీ

అగళి, నవంబర్ 17 ప్రభాతవార్త

అగళి మండలంలో విద్యుత్ ఏఈ పోస్టు ఖాళీ అయి 8 నెలలు అయినా అది ఇంత వరకు భర్తీ చేయడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందలాది మంది రైతులు విద్యుత్ సర్వీసుల కోసం, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురు చూస్తున్నా ఏఈ పోస్టు లేకపోవడంతో సర్వీసులు కానీ, ట్రాన్స్‌ఫార్మర్లు కానీ ఇంత వరకు రైతులకు రాలేని పరిస్థితి. సర్వీసులకు, ట్రాన్స్‌ఫార్మర్లకు రైతులు చెల్లించాల్సిన డబ్బుల కంటే అధిక మొత్తంలో ఇటీవల పని చేసిన ఏఈలు రైతులతో గుంజారని దాదాపు లక్షల్లో రైతుల నుంచి సర్వీసులు ఇస్తామని ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తామని డబ్బులు తీసుకుని మింగేశారు కానీ, రైతులకు వారు చెల్లించాల్సిన డబ్బులు లేవు, ట్రాన్స్‌ఫార్మర్లు లేవు, సర్వీసులు అసలుకే లేదని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా సర్వీసుల క ఓసం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం విద్యుత్ సిబ్బందిని సంప్రదించగా రెగ్యులర్ ఎఈ వస్తేకానీ వాటిని ఇవ్వలేమని, లేని యెడల వాటిని ఇవ్వలేమని అంటున్నారు. లక్షలాది రూపాయల డబ్బులను ఎగ్గొట్టి వారికి సర్వీసులను ఇవ్వకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిన సదరు అధికారులపై సమగ్రమైన విచారణ జరిపి రైతులకు అందాల్సిన డబ్బులనైనా ఇప్పించాలి, లేదా సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లనైనా ఇప్పించాలని మండల రైతులు ప్రశ్నించారు. కొత్త ఏఈలను అగళి మండలానికి పోస్టింగ్ చేస్తే గతంలో పని చేసిన ఏఈల అవినీతి బాగోతం తెలుసుకుని వారు ఇక్కడికి రావడానికి భయపడుతున్నారని తెలిసింది. కావున సంబంధిత శాఖ ఉన్నతాధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ఏఈలు రైతుల నుంచి తీసుకున్న డబ్బులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో పని చేసిన ఏఈ ఈ విధంగా రైతులను మోసం చేయడంతో రైతులకు న్యాయం జరగకపోగా కొత్తగా ఏఈలు ఇక్కడకు రావడానికి జంకుతున్నారంటే ఏ విధంగా సదరు విద్యుత్ ఏఈ అవకతవకలకు పాల్పడ్డారో అవగతం అవుతుంది. కావున ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేయాలని మండల రైతులు ప్రశ్నిస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివి

కొత్త చెరువు, నవంబర్ 17 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వానికి సంక్షేమం , అభివృద్ధి రెండు కళ్ళు లాంటీవని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండలంలో శుభకార్యాలకు హాజరైన సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడాతూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల పాలయ్యింది కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా పయనిస్తోందని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన 5 మాసాల్లోనే అనేక సంక్షేమ పథకా

06ATP17_06ATP17.qxd 17-11-2024 PM 10:50 Page 1

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

పోస్టర్లు విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 17 ప్రభాతవార్త

2025 జనవరి 5వ తేదీ విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో పరివార సంస్థల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ శ్రీ హిమకర్ మాట్లాడుతూ దేవాలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, దేవాలయాలలో అన్యమతస్తుల ఉద్యోగులను తొలగించి, దేవాలయ ట్రస్ట్ బోర్డులలో రాకీయ పార్టీలతో సంబంధం లేకుండా హిందూ దైవ భక్తులు మాత్రమే ఉండాలని, హిందూ సమాజం పై ఆలయాలపై కుట్రపూరితంగా జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు గుర్తించి గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. పూజ ధర్మాచార్యులు ఆశీస్సులతో దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా విజయవాడలో 05 జనవరి 2025తేదీన హైందవ శంఖారావం భారీ బహిరంగసభ నిర్వహించబడుతున్నదని, లక్షలాదిగా పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమం యొక్క కరపత్రాలను ఆవిష్కరించారు. కళ్యాణదుర్గంలో జరిగే ఈ ఉద్యమ కన్వీనర్‌గా జి.వెంకటరమణ, కో కన్వీనర్లుగా వేలూరి విజయబాస్కర్ నాయుడు, తలారి సోమశేఖర్, బంగారు మల్లారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి నేతలు మెడ నాగభూషణం, నరహరి, శ్రీకాంత్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాల వల్ల కెజిబివిలో కూలిపడ్డ ప్రహారీగోడ

వర్షానికి కూలి పడ్డ ప్రహారీ గోడ

బ్రహ్మసముద్రం, నవంబర్ 17 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండల కేంద్రంఓలని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు వంద మీటర్ల ప్రహారీగోడ కూలి పడింది. అసలే ప్రమారీ గోడ ఎత్తులేక బాలికలు, సిబ్బంది బాధపడుతుంటే గోరు చుట్టపై రోకలి పోటుల అన్న చందంగా ఉన్న గోడ సైతం పడిపోవడంతో పాఠశాలలో విద్యార్థినులు ఉపాధ్యాయ సిబ్బంది బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు స్పందించి తొందరగా ప్రహారీ గోడ నిర్మించి విద్యార్థినులకు భరోసా కల్పించాలని పేరెంట్స్, గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు నూతన ఎంపిపి ప్రమాణ స్వీకారం

కంబదూరు, నవంబర్ 17 ప్రభాతవార్త

లక్ష్మిదేవి

గత మూడు సంవత్సరాల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ఎంపిపి స్థానానికి పోటీపడి, అప్పటి పరిస్థితులకనుగుణంగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నేడు రాళ్ల అనంతపురం సెగ్మెంట్ ఎంపిటిసి లక్ష్మిదేవి, జిల్లా జడ్పి సిఈఓ ఉత్తర్వుల మేరకు, ఆ పార్టీ దిశా నిర్దేశం మేరకు కంబదూరు మండల పరిషత్ అధ్యక్షురాలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి కళ్యాణదుర్గం నియోజకవర్గ వైకాపా సమన్వయ కర్త డాక్టర్ పిడి తలారి రంగయ్య, రాజకీయాల పరిస్థితులను నీటి నిజాయితీతో ఎదుర్కొని కార్యకర్తలకు బాసటగా నిలిచి డైమండ్ లీడర్ షిప్ పొందిన ఉమ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. కావున వైకాపా సర్పంచులు, ఎంపిటిసిలు, ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు తదితర అభిమానులు, శ్రేణులు విరివిగా తరలి వచ్చి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి జయప్రదం చేయగలరని వారు కోరుతున్నారు.

దేశ ప్రజల ఆస్తులు ఆదాని, కార్పొరేట్ కంపెనీలు స్వాహా

ప్రదర్శనలు గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు.

కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 17 ప్రభాతవార్త:

మోడి కార్మిక కర్షక, వ్యతిరేక విధానాలకు నితరసనగా నవంబర్ 26వ తేదీ జిల్లా కేంద్రంలో ప్రదర్శనలు కార్యక్రమాన్ని జయప్రదం కోసం ఆదివారం కళ్యాణదుర్గం పట్టణంలోని వివేకానంద డిగ్రీ కాలేజ్ నందు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ అధ్యక్షతన ప్రజా సంఘాల సమన్వయ కమిటి సభ్యుల సమావేశంలో సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఏపిరైతు సంఘం, ఏపి కార్మికుల రైతు కూలీ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు సోమగుట్ట నాగేంద్రకుమార్, నాగమణి, రాజేష్‌గౌడ్, ఏసురత్నం, శివారెడ్డి, బిహెచ్.రాయుడు, జిల్లా కార్యదర్శి పరమేష్‌లు మాట్లాడుతూ 90శాతం దేశ ప్రజల ఆస్తులను అదాని, కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టే విధంగా మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని మోడీ 10 సంవత్సరాల పరిపాలన కాలంలో ఆదాన్ని ఆస్తుల ప్రపంచ కుబేరులతో రెండో స్థానానికి మోడీ నిరంతరం శ్రమ చేస్తున్నారు. మోడీ ఎన్నికల సందర్భంగా దేశానికి కాపులాగా ఉంటాను ప్రజల ఆసక్తి భరోసా ఇస్తాను మోడీ చెప్పిన ఏమయ్యాయి అని ప్రశ్నించారు. ప్రజల సొమ్మును, ఆదానికి దోసి పెట్టారని, గ్యాస్ ధరలు, పెట్రోల్, డిజిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారం మోపెరన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా, పనిముట్లు, ఎరువులు ధరలు పెంచారన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశాన్ని కేంద్రంలో మతోన్మాద బిజెపి పార్టీ పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ లాంటి మత రాజ్యాలుగా మార్చాలని, ప్రయత్నాస్తున్నారని, మత రాజ్యాల్లో అభివద్ధి కాలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాల అమలు చేస్తున్నారని, పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ పరం చేస్తున్నారని, నిర్బంధాల ద్వారా ఉద్యమాలను అనచాలని చూస్తున్నారన్నారు. మతోన్మాద బిజేపి నుండి దేశాన్ని రక్షించడానికి సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గోపాల్, రైతు కూలీ సంఘం నాయకుడు రాయుడు, సిఐటియు రాఘవేంద్ర, రంగనాథ్, తిప్పేరమ్మ, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, ఏఐటియుసి డివిజన్ నాయకులు బుడేన్, లక్ష్మిదేవి, డివైఎఫ్ఐ నాయకులు శోము, భవిత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కాలవకు అభినందనలు తెలిపిన తెలుగు తమ్ముళ్లు

కాలవ శ్రీనివాసులను సన్మానిస్తున్న మండల తెదేపా నాయకులు

డి.హీరేహాళ్, నవంబర్ 17 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విప్‌గా నియమితులైన రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం కర్ణాటకలోని బళ్లారి పట్టణంలోకిసి శాలువా వేసి పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబుళాపురం గ్రామ తెదేపా సీనియర్ నాయకులు శ్రీరామకృష్ణ, కాదలూరు మోహన్‌రెడ్డి, రాయదుర్గం మండల కన్వీనర్ ఎంఆర్ఎఫ్ హనుమంతు, మాజీ సర్పంచ్ సత్యప్పగారి వెంకటేష్, మాజీ డీలర్ కోళూరు విరుపాక్షిగౌడ్, మాజీ డీలర్ బెళగల బసవరాజు, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ

- కోలాహలంగా మైలార లింగస్వామి ఆలయం పునఃనిర్మాణం

ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాలవ భరత్ తదితరులు

రాయదుర్గం, నవంబర్ 17 ప్రభాతవార్త

మున్సిపాలిటి పరిధిలోని 22వ వార్డు అంబేద్కర్ నగర్‌లో ఉన్న పురాతన ఆలయమైన శ్రీ మైలార లింగస్వామి ఆలయాన్ని పునఃనిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ చేతులమీదుగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు మరియు ప్రత్యేకంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణాచార్యులు, గోరవయ్యలు ప్రత్యేక నృత్యాలు చేసి కోలాహలంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించచడంతో పలువురిని ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటి సభ్యులు ఎం.ఆనందు, సివై మల్లేష్, ఉప్పు శ్రీనివాసులు, హెచ్.రామకృష్ణ, చకరి కృష్ణ, అల్లద నాగరాజు, ఎల్లజి గారి వన్నూరుస్వామి తదితరులు కలిసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించిన అనంతరం వారు మాట్లాడుతూ సొంత నిధులతో లక్షలాది రూపాయల వ్యయంతో దేవాలయం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దాతలు, భక్తులు సహాయ సహకారాలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. గణాచార్యులు ఉడేగోళం మూర్తి, వీరాపురం తిప్పేస్వామి, గోరవయ్యలుతో ప్రత్యేక నృత్యాలు చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ కన్వీనర్ పసుపులేటి రాజు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మెన్ బంగి శంకర్, సిమెంట్ శీన, ఎస్సీ మల్లికార్జున, మాజీ కౌన్సిలర్ మల్లక్క, 22వ వార్డు కౌన్సిలర్ వన్నూరుస్వామి, శారదమ్మతదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలను విడుదల చేయాలి

- పీడిఎస్‌యూజిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్

నిరసన వ్యక్తం చేస్తున్న పిడిఎస్‌యూ నాయకులు.

కణేకల్లు, నవంబర్ 17 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఆరు నెలలుగా పెండిగ్లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కణేకల్లు పట్టణంలో సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలు 2733ఉన్నాయి. వీటిలో మూడు లక్షల 13,695మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి కావస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మెస్ చార్జీలు నేటి వరకు విడుదల కాలేదన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లు వెంటనే విడుదల చేసి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు అప్పుల భాదల నుండి ఉపసమనం కల్పించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసద్, కణేకల్లు మండల అధ్యక్షులు బాబా ఫకృద్దీన్, పిడిఎస్యూ నాయకులు ఖాజాపీర్, కార్తీక్, అనిల్, భీమేష్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

వందలాది మహిళల మధ్య గౌరమ్మ దేవి ఊరేగింపు

కణేకల్లు, నవంబర్ 17 ప్రభాతవార్త

గౌరమ్మ దేవిని ఊరేగిస్తున్న భక్తులు

పట్టణంలో ఆదివారం తెల్లవారు జాము నుండి పిల్లలు పెద్దలు అందరూ కోలహాలంతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పురవీదుల గుండా ఊరేగింపుగా నిర్వహిస్తూ కణేకల్లులోని శ్రీ సిద్ధప్ప దేవాలయం దగ్గర మరియు కురుబ వారి వీధిలోని బీరప్ప దేవాలయం దగ్గర అమ్మవారిని ప్రతిష్టించిన మండల పాలలో గౌరమ్మ దేవి ఉత్సవాలు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున చెరువు వరకు ఏటికి తరలించే ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని గంగమ్మ నీటిఒడిలోకి వెళ్లి వదిలి అమ్మవారిని గౌరమ్మతల్లి పోయిరావమ్మ అంటూ అందరూ సాగనంపారు. తల్లిపోయిరావమ్మ అంటూ అందరూ సాగనంపారు.

కొల్లిపాలెంలో టిడిపి సభ్యత్వం నమోదు

కుందుర్పి, నవంబర్ 17 ప్రభాతవార్త

సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నేతలు

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు, కుందుర్పి మండలం కొలిమిపాళ్యం గ్రామంలో శనివారం, ఆదివారం రాత్రి స్థానిక టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. ఇందుకు అనుగుణంగా గ్రామంలో ప్రతి ఒక్కరు సభ్యత్వ నమోదులో భాగస్వాములవుతున్నారు. ఈ కార్యక్రమం స్థానిక టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఎన్.గిడ్డప్ప, పార్టీ సీనియర్ నాయకులు బి.గోవిందు, గవప్ప, కె.బాబు, ఎన్.మల్లికార్జున, టి.సునీల్‌కుమార్, జంబుగుంపల బి.విజయ్‌కుమార్, సికిందర్ పాల్గొన్నారు.

ధార్మికత, ప్రాపంచిక విద్యపై విద్యార్థులకు పరీక్షలు

ముస్లిం నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని కెఎం ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ముస్లిం మదరసాలు, పాఠశాలల్లో దదివే విద్యార్థులకు ఎస్ఎస్ఎఫ్ (సున్ని స్టూడెంట్ ఫెడరేషన్) సంస్థ ధార్మికత, ప్రాపంచిక విద్యపై పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు గుత్తితో పాటు వివిధ ప్రాంతాల నుండి దాదాపు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో ఈ నెల 29,30, డిసెంబర్ 1వతేదీన గోవాలో జరిగే పోటీ పరీక్షల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ఏపి రాష్ట్ర అధ్యక్షులు ముస్తే మొహమ్మద్‌మన్సూర్‌అలీ, రాష్ట్ర కార్యదర్శి షంషుద్దిన్, వైసిపి నాయకులు హుసేన్‌పీరా, పట్టణ టిడిపి అధ్యక్షులు ఎంకె చౌదరి, కోళ్లఫారం శీన, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సిఎస్ఐ చర్చి వేడుకలు

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

గుత్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని సిఎస్ఐ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గత మూడు రోజులుగ ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా రాయలసీమ దయాలసిస్ బిషన్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే జయరాం కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు గుమ్మనూరు నారాయణలు హాజరయ్యారు. చారిత్రక నేపథ్యం కలిగిన చర్చి స్థానికంగా వుండడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చర్చి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గుమ్మనూరు ఈశ్వర్ లక్ష రూపాయల విరాళం అందచేశారు. ఈ కార్యక్రమంలో రసెల్ కిరణ్, సాల్మన్, సురేంద్రబాబు, మనోరంజిత, సుశీల్‌కుమార్, మాధురిదేవి, కవిత, నీలిమ, ప్రేమ్‌కిరణ్ పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

గుత్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

మృతి చెందిన వ్యక్తి

మండలంలోని కొత్తపేట శివారులోని కంకరఫ్యాక్టరీలో పనిచేస్తున్న దిలీప్‌సాకేత్ (22) అనే కార్మికుడు అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్‌సాకేత్ వెంకటాంపల్లి సమీపంలోని శివకృష్ణ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి శనివారం వేతనం అందగా తన మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. తదుపరి అతను కింద పడిపోవడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఉద్యోగి మృతి

మృతి చెందిన రైల్వే ఉద్యోగి (ఫైల్‌ఫోటో)

గుత్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

గుత్తి రైల్వే డిజిల్‌షెడ్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్ర చక్రవర్తి (38) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మాధవి నాటక కళాపరిషత్ గౌరవాధ్యక్షునిగా నాటక రంగాన్ని ప్రోత్సహించేవారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మరణం పట్ల తోటి కార్మికులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న...బండి

వధూవరులను ఆశీర్వదిస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

డి.హీరేహాళ్, నవంబర్ 17 ప్రభాతవార్త:

మూడు ముళ్లతో ముడిపడిన మీ వివాహ బంధం నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో సాగాలని రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమసేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప, ఆ సేవా సమితి కార్యదర్శి ఎన్‌టి.సిద్దప్ప, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, సభ్యులతో కలిసి పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో ఆయన వెంట ఆ సేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయ వెంకటేశులు, సభ్యులు అజయ్‌టైలర్ రఘు, మిత్రుడు వడ్డే వెంకటేశులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కి గాయాలు

డి.హీరేహాళ్, నవంబర్ 17 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో గాయడ్డ ఆటో డ్రైవర్ మారెన్న

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ మారెన్నను మరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్సై అందించిన వివరాల మేరకు ఆదివారం డి.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మంగళూరు నుండి బళ్లారి వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొన్నట్లు ఆయన చెప్పారు. ఈ సంఘటనలో బలమైన గాయాల పాలైన ఆటో డ్రైవర్నున హుటాహుటిన ఆంబులెన్స్‌లో బళ్లారి విమ్స్‌కు తరలించడం జరిగిందని బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొంతున్నాడని ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారని ఎస్సై చెప్పారు.

మానవ సేవయె మాధవ సేవ

ఉరవకొండ, నవంబర్ 17 ప్రభాతవార్త

మానవ సేవయె మాధవ సేవని ప్రతిఒక్కరూ తోటివారికి చేతనైనంత సాయం చేయాలని గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాథాశ్రమంలోని వృద్ధ అనాథలకు దాత చంద్రిక మెడికల్స్ మల్లికార్జున సమకూర్చిన దుప్పట్లు, గొడుగులను ఉత్తరాధికారి పంపిణీ చేశారు.

అడుగుతీసి అడుగు వేయలేం..!

-అధ్వాన్నంగా పట్టణంలోని సాయిభీమా నగర్ ప్రధాన రోడ్డు

-అధికారులు, ప్రజాప్రతినిధులకు కనబడని రోడ్డు దుస్థితి

-కంటి పరీక్షల కేంద్రానికి వచ్చివెళ్లేందుకు వృద్ధుల అవస్థలు

వర్షపునీరు నిలబడి అధ్వాన్నంగా ఉన్న సాయి భీమానగర్‌లోని ప్రధాన రోడ్డు

ఉరవకొండ, నవంబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని ఏవీఆర్ పాఠశాల సమీపంలోగల సాయిభీమా నగర్ ప్రధాన రోడ్డు అడుగుతీసి అడుగు వేయలేని విధంగా అధ్వాన్నంగా తయారైంది. కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడిచిపోతున్నా ఇక్కడ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేకపోగా ఉన్న మట్టిరోడ్డు కాస్త వర్షాలకు నీరు నిలబడి బురదమయంగా మారి దయనీయ స్థితికి చేరుకుంది. కాలనీలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్‌కు చెందిన స్టడీ, యోగా కేంద్రంతోపాటు అక్కడే ఎల్వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల కేంద్రం నడుస్తోంది. కంటి పరీక్షల కేంద్రానికి ప్రతిరోజూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పదుల సంఖ్యలో వృద్ధులు కంటి పరీక్షలకు వస్తుంటారు. అయితే రోడ్డు అడుగుతీసి అడుగు వేయలేని విధంగా తయారు కావడంతో వారి అవస్థలు వర్ణణాతీతంగా మారుతున్నాయి. అనేకమంది కాలుజారి పడి గాయాలపాలు కావడం కూడా ఇటీవల సర్వసాధారణమైంది. ఇక్కడ పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా మేజర్ గ్రామ పంచాయతీ రోడ్డుకు కనీస మరమ్మతు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రంలోని కూటమి ఇటీవలి కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే అధికారులు అధ్వాన్నంగా ఉన్న మట్టిరోడ్డు స్థానంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చొరవ చూపకపోవడంపై కాలనీ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము ట్యాక్సులు కట్టడటంలేదా అని ప్రశ్నిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ కొత్త సీసీ రోడ్డు ఏర్పాటు చేయడమో లేక అప్పటివరకు ఉపశమనం కోసం మరమ్మతులు చేయించడమో యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

-అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మినారాయణ

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

ఉరవకొండ, నవంబర్ 17 ప్రభాతవార్త

ఐకమత్యంతో ఉంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సది ్వనియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మినారాయణ అన్నారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో వాల్మీకి సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం అట్టహాసంగా జరిగిన వాల్మీకి మహర్షి విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మరో ముఖ్య అతిథి గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, అమరావతి హాస్పిటల్ ఎంపీ అవె ముత్యాలన్న, వాల్మీకి నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. ఈ సందర ్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకులు తమ పిల్లలకు బాగా చదివించాలని ఎవరి జీవితాల్లోనైనా వెలుగును నింపే శక్తి చదువుకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అడ్వకేట్ ప్రతాప్‌నాయుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్లు రేగటి నారగాజు, బి.సి.మారెన్న, నాయకులు రామకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా కడ్లే గౌరమ్మ విగ్రహ ఊరేగింపు

అమ్మవారి విగ్రహం నిమజ్జన పూజల్లో పాల్గొన్న ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, నవంబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని కడ్లే గౌరమ్మ అమ్మవారి విగ్రహ ఊరేగింపు కార్యక్రమం స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం కార్తీక విదియ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక 13వ వార్డు కాలనీలోని కడ్లే గౌరమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి శు క్రవారం రోజు కొలువుదీర్చిన కడ్లే గౌరమ్మ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో వుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధ

04ATP17_04ATP17.qxd 17-11-2024 PM 10:32 Page 1

లత్తవరం శ్రీక్షేత్రం ఉమామహేశ్వర ఆశ్రమంలో కార్తీక శోభ

- మూడవ ఆదివారం భక్తుల వనభోజనాల సందడి

- ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు

ఉసిరి చెట్టు క్రింద వనభోజనాల చేస్తున్న భక్తులు

నాగులపుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శంకరానందగిరి స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయంలో దీపాలు వెలగిగిస్తున్న దృశ్యం

ఉరవకొండ, నవంబర్ 17 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో వెలసిన శ్రీ క్షేత్రం ఉమామహేశ్వర ఆశ్రమం కార్తీక శోభను సంతరించుకొంది. స్వస్తిశ్రీ క్రోది నామ సంవత్సరం కార్తీక మూడవ ఆదివారం కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా క్షేత్రాన్ని సందర్శించి మఠాధిపతి మహేశ్వరానందగిరి స్వామిజీ సమక్షంలో చంద్రమౌళీశ్వరస్వామి, శంఖరానందగిరి స్వామి వార్ల ఆలయాలను దర్శించుకొని పూజలు నిర్వహించి అక్కడ కార్తీక దీపాలు వెలిగించారు. ఆశ్రమ ఆవరణంలోని ఉసిరి చెట్లు, నాగులపుట్టవద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం తమవెంట తెచ్చుకున్న వివిద రకాల పిండి వంటకాలతో ఉసిరిచెట్ల క్రింద వన భోజనాలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటపాట లతో ఆనందంగా గడిపారు. కార్తీక మా సంలో ఉసిరిచెట్ల క్రింద వన భోజనాలు నిర్వహిస్తే మంచి చేకూరు తుందని భక్తుల నమ్మకంతో ప్రతి యేడాది కార్తీక మాసంలో ఈ క్షేత్రంలో వన భోజనాలు చేయడం ఇక్కడ పరిపాటిగా కొనసాగుతోంది.

వైభవంగా శ్రీ రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం

హిందూపురం, నవంబర్ 17 ప్రభాతవార్త

హిందూపురం పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన గుడ్డం శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అత్యంత వైభవంగా రథోత్సవం జరిగింది. వేకువ జాము నుంచే ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు అనంతరం శ్రీవారి మూలవిరాట్ కు ప్రధానార్చకులు గోవింద శర్మ విశేష అలం కరణ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయ ంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను భక్తిశ్రద్ధల మధ్య ఆలయ ప్రదక్షణ చేసి తదుపరి రథంపై ప్రతిష్టింప చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోవిందా.. గోవింద అని నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. మహిళా బృందం శ్రీనివాసుని పాటకు అనుగుణంగా కోలాటం ప్రదర్శన చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ నాగేంద్రుడు, రాజ్యలక్ష్మి మోహన్, నర్సింహులు, కట్ల వెంకటేష్, కళా హరికుమార్, నాగరాజు ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంకాలం కన్నుల పండుగగా పుష్పయాగం, జ్వాలా తోరణం నిర్వహించారు.

శ్రీవారిని తెస్తున్న భక్తులు

బ్రహ్మరథోత్సవం దృశ్యం

కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతా

- వాట్సాప్‌కాల్ చేయండి - డిసెంబర్ నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తా

- పెద్దవడుగూరు మండల నాయకులకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి భరోసా

అనంతపురం, నవంబర్ 17 ప్రభాతవార్త బ్యూరో

.తాడిపత్రి నియోజకవర్గంలో ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు అండగా ఉంటానని, కార్యకర్తలు ఏ కష్టం వచ్చినా నేరుగా తనకు వాట్సాప్ కాల్ చేయండని.. ఆ నాయకుడికి చెప్పినా ఈ నాయకునికి చెప్పినా అంటే నాకు సంబంధం లేదని.. డిసెంబర్ నుంచి నేను అన్ని గ్రామాలు, మండలాల్లో పర్యటించి కార్యకర్తలు నాయకులకు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తానని అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం అనంతపురంలో ఉన్న తన నివాసంలో పెద్దవడుగూరు నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో పెద్దారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి నియోజజకవర్గంలో నేను ఎమ్మె ల్యేగా ఉన్నప్పుడు మార్పు కోసం ప్రయత్నించానన్నారు. రెండు వర్గాల నుంచి మార్పు కోరుకుంటేనే ఫలితం ఉంటుంది. నేనొక్కడినే మార్పు కోరుకుంటే ఏం లాభం అన్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాడిపత్రి నియోజకవర్గంలో ఏ మండలంలో కానీ, గ్రామంలోకానీ గొడవలను ప్రోత్స హించ లేదన్నారు. గ్రామాల్లో ఎక్కువ మంది వ్యవసా యంపై ఆధారపడ్డారని, గ్రామాభివృద్ధి కోసం పని చేశానన్నారు. ఇప్పుడు మండలాల్లో గ్రామాల్లో చిన్న చిన్న విషయాల్లో కూడా తెలుగుదేశం వారు బెదిరింపులకు పాల్ప డుతున్నారన్నారు. ఎక్కడైనా కార్యకర్తలకు ఇబ్బంది కలిగితే మిగతా మండల నాయకులు, కార్యకర్తలు వారికి మద్దతుగా పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నేను సంపూర్ణ సహకారం ఇస్తానని పెద్దారెడ్డి తెలిపారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

సమావేశానికి హాజరైన వైకాపా నాయకులు, కార్యకర్తలు

నేడు కనకదాస రాష్ట్రస్థాయి జంతోత్సవాలు

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, డైరెక్టర్

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 17 ప్రభాతవార్త

ఈ నెల 18వ తేదిన సోమవారం నిర్వహించే శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవం కార్యక్రమం నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయానలి రాష్ట్ర బిసి వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించే శ్రీ భక్త కనకదాసు రాష్ట్ర స్థాయి జయంతోత్సవం సందర్భంగా అనంతపురం నగరంలోని గుత్తిరోడ్‌లో ఉన్న కెటిఆర్ కన్వెన్షన్ హాల్‌లో కార్యక్రమం సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర బిసి వెల్ఫేర్ సంచాలకులు, మేనేజరింగ్ డైరెక్టర్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎటువంటి లోటు పాట్లు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపి లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడం జరుగుతుందని, రాష్ట్రస్థాయి జంతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి బిసిబి కార్పోరేషన్ జాయింట్ కలెక్టర్ మేనేజింగ్ డైరెక్టర్ తనూజా రాణి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఆర్డిఓ కేశవనాయుడు, బిసి వెల్ఫేర్ డిడి.కుషూ ్బ కొఠారి, ఐ అండ్ పిఆర్ డిఎపిఆర్ గురుస్వామి శెట్టి, డిటిడ ్బ్యూటి రామాంజినేయులు, తహశీల్దార్ హరికుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, డైరెక్టర్ మల్లికార్జున

క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యం - అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ

శింగనమల, నవంబర్ 17 ప్రభాతవార్త

క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని అనంతపురం అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తరిమెల గ్రామంలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవానికి ఏఎస్‌పి మల్లికార్జున వర్మ, అనంతపురం రూరల్ డిఎస్పీ వెంకటేసులు, శింగనమల ఎస్ఐ శరత్ చంద్రలు హాజరై బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతమైన తరిమెలలో క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని క్రీడల వల్ల యువత ప్రతిభను గుర్తించేందుకు వీలవుతుందని, క్రీడల్లో 22 జట్లు పాల్గొని తమ ప్రతిభను కనబర్చాయని ఓటమి గెలుపునకు పునాది అని ఎప్పుడు అధైర్య పడకుండా ముందుకెళ్లాలని వారు పేర్కొన్నారు. వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి తరిమెల, రెండో బహుమతి అగళి, మూడో బహుమతి గార్లదిన్నె, నాల్గవ బహుమతి ఎంఎం పల్లి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు బిల్లగళ్ల ఓబులేసు, ఇషాఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌పి మల్లికార్జునవర్మ

మాట్లాడుతున్న అనంత రూరల్ డిఎస్పీ వెంకటేసులు

విద్యాశాఖ సహాయ సంచాలకుల అక్రమ పదోన్నతులపై జ్యూడీషియల్ ఎంక్వైయిరీ జరపాలి

- ఏడిల అక్రమ పదోన్నతులు రద్దు చేయాలి - రాష్ట్రంలో 22 మందిపైగా అసిస్టెంట్ డైరెక్టర్లు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వారిని వెంటనే రివర్షన్ చేయాలి - రాష్ట్రంలో 13 పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను డివైఈఓ పోస్టులుగా మార్చి వాటిని అసిస్టెంట్ డైరెక్టర్లకు రిజర్వ్ చేయమని అడ్డగోలు ఆదేశాలు - విద్యార్హత లేకపోయినా, ఫీడర్ క్యాటగిరి కాకపోయినా, విద్యానుభవం లేని అసిస్టెంట్ డైరెక్టర్లకు డైట్ ప్రిన్సిపాల్‌గా ఏడుగురికి పదోన్నతి కల్పన - హైకోర్టు ఆదేశాల మేరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు పూర్తి అదనపు బాధ్యతలు తీసుకునే హక్కు జిల్లా పరిషత్‌ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు మాత్రమే ఉంది - మనోవిజ్ఞాన శాస్త్రం గురించి కనీస అవగాహన లేని సహాయకంచాలకులు - దోపిడినే పరమావదిగా సహాయ సంచాలకులు - ఇతర రాష్ట్రాల్లో సహాయ సంచాలకులకు విద్యాశాఖలో జిల్లా పోస్టులు కేటాయించబడలేదు - డిఈఓ, డివైఇఓ, డైట్ ప్రిన్సిపాల్ పదోన్నతులపై జ్యూడిషియల్ విచారణ జరపాలి - నవ్యాంధ్ర టీచర్స్ అసోషియేషన్ నేతలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 17 ప్రభాతవార్త

విద్యాశాఖలో సహాయ సంచాలకుల అక్రమ పోదన్నతులపై విశ్రాంత న్యాయమూర్తులచే విచారణ జరిపించాలి, వారి అక్రమ పదోన్నతులు రద్దు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్లు విద్యాశాఖలో అక్రమంగా రాజ్యమేలుతున్నారని పేర్కొ న్నారు. దనార్జన పరమావదిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశా లలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత వీడి, భయానక వాతావరణాన్ని సృష్టించి దోపిడి సామ్రాజ్యాన్ని సృష్టించుకున్నారని తెలిపా రు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అక్రమ పదోన్నతులు పొందుతూ విద్యా విధ్వంసాన్ని సృష్టించారని దుయ్యబట్టారు. నిబంధనలు తుంగలోకి తొక్కి పదోన్నతులు పొందారని వాపోయారు. మనోవిజ్ఞాన శాస్త్రం గురించి తెలియ ని వీరు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశారని బాధను వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యకు అండగా నిలుస్తున్నారని వివరించారు. డిఈఓ, డివైఇఓ, డైట్ ప్రిన్సిపాల్ పదోన్నతులపై జ్యూడిషియల్ విచారణ జరపాలని అభ్యర్థించారు. విద్యాశాఖలో సహాయ సంచాలకుల క్యాడర్ స్రెంత్ 72 కాగా ప్రసుతం పని చేస్తున్నది రెట్టింపుగా ఉందన్నారు. ఇది ఎలా సాధ్యమని ప్రశ్ని ంచారు. జీఓ ఎంఎస్ నెంబర్ 505, జీఓ ఎంఎస్ నెంబర్ 73ల ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులకు పదోన్నతిపై డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, లెక్చరర్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, డైట్ సీనియర్ లెక్చరర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ల నుండి 12 పాయి ంట్ సైకిల్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ సైకిల్‌లో రెండు పాయింట్లు మాత్రమే అసిస్టెంట్ డైరెక్టర్లకు కేటాయించబడ్డాయి. కానీ వన్ టైం ఎగ్జమ్షన్స్, స్పెషల్ పర్మిషన్ అని కొత్త జీవోలు తెచ్చి సైకిల్‌లో అన్ని పోస్టు లను అసిస్టెంట్ డైరెక్టర్లకు పదోన్నతి కల్పించారు. ఉపాధ్యాయుల పదోన్న తుల అవకాశాలను కొల్లగొట్టారని ఆరోపించారు. ఏపిఇఎస్ 2017 నియమాలు తుంగలోకి తొక్క పడ్డాయని సోదాహరించారు. రాష్ట్రంలో 13 పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను డివైఈఓ పోస్టులుగా మార్చి వాటిని అసిస్టె ంట్ డైరెక్టర్లకు రిజర్వ్ చేయమని అడ్డగోలు ఆదేశాల ఇచ్చారని తెలిపారు. డైట్ ప్రిన్సిపాల్ పోస్టులు ఫీడర్ కేటగిరి అయిన సీనియర్ డైట్ లెక్చరర్లు పదోన్నతి అర్హులు, విద్యార్హత లేకపోయినా, ఫీడర్ క్యాటగిరి కాకపోయినా, విద్యానుభవం లేని అసిస్టెంట్ డైరెక్టర్లకు డైట్ ప్రిన్సిపాల్‌గా ఏడుగురికి పదోన్నతి కల్పించారని విశదీకరించారు. మనోవిజ్ఞాన శాస్త్రం గురిం చి కనీస అవగాహన సహాయ సంచాలకులకు లేదన్నారు. విద్యా రంగంలో మనోవిజ్ఞాన శాస్త్రమే క్రియాశీలకమని విశ్లేషించారు. దోపిడినే పరమావదిగా సహాయ సంచాలకులు వ్యవహరిస్తున్నారని వివరించారు. ఇతర రాష్ట్రాలో సహాయ సంచాలకులకు విద్యాశాఖలో జిల్లా పోస్టులు కేటాయి ంచబడలేదు. కానీ ఆంధ్రప్రవేశ్‌లో సహాయ సంచాలకులు విద్యాశాఖలో జిల్లా పోస్టులలో అక్రమంగా పదోన్నతులు పొందుతున్నారని తెలుపుతూ.. ఇది చట్ట విరుద్ధమన్నారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సీనియర్ డైట్ లెక్చరర్లుగా పదోన్నతికి అర్హులైనప్పటికీ పరిగ ణలోకి తీసుకోల దని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవనీయ పదోన్నతికి అర్హులైన ప్పటికీ పరిగణ లోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాకోర్టు ఆదేశాల మేరకు డిప్యూ టీ ఎ డ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు పూర్తి అదనపు బాధ్యతలు తీసుకునే హక్కు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికా రులకు ఉన్నప్పటికీ నిరాకరించడం వివక్షాపూరితమన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్‌లను డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ల పోస్టులు పూర్తి అదనపు బాధ్య తలు అప్పగించ ్డం బాధాకరమన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టు అకాడమిక్ పోస్టు అని తెలుపుతూ ఆ బాధ్యత కలిగిన వారు ఇయర్ ప్లాన్‌లు, యూనిట్ ప్లాన్లు, యూనిట్ టెస్ట్‌లు, కరిక్యూలర్, కోకర్యూలర్ కృత్యాలను సిద్ధం చేయడానికి ఉపాధ్యాయులకు మార్గం నిర్దేశాలు చేయవలసి ఉంటుందని చెప్పారు. ప్రధానోపాధ్యాయులకు డిప్యూటీ డిఈఓలు పదోన్నతి కల్పించడం ద్వారా వారు మాత్రమే న్యాయం చేయగలుగుతారని విశ్లేషిస్తూ ఏపిఇఎస్ 2017 నియమాలలో ఎక్కడ అసిస్టెంట్ డైరెక్టర్లను డిప్యూటీ ఎడ్యూకేషన్ ఆఫీసర్ పోస్ట్‌కు బదిలీ చేసే అవకాశం అందించబలేదని అయినా వారికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడం ద్వారా విద్యా వ్యవస్థ అతలాకుతంగా మార్చబడుతోందని వివరించారు. రాష్ట్రంలో 22 మందిపైగా అసిస్టెంట్ డైరెక్ట ర్లు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. అక్రమ కన్వెర్షన్‌లను రద్దు చేసి, రీకాల్ చేయాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లు అక్రమంగా రాజ్యమేలుతున్నారని, అక్రమ పదోన్నతులపై జ్యూడిసియల్ ఎంక్వైయిరీ వేసి విచారణ జరిపి అకాడమిక్ పోస్టల నుంచి వారిని రిలీవ్ చేయాలని, వారి అక్రమ పదోన్నతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లక్షలాది రూపాయల తీసుకొని సహాయ సంచాలకులకు పదోన్న తులు కల్పిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని, సమాజం బహిరంగంగా చర్చిస్తోందని, వీటిపై విశ్రాంత న్యాయమూర్తులచే విచారణ జరిపించాలని కోరారు.

నేత్రపర్వంగా కోటి దీపోత్సవం కార్యక్రమం

కోటి దీపోత్సవంను ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత - పంపనూరుకు పోటెత్తిన భక్తులు

ఆత్మకూరు, నవంబర్ 17 ప్రభాతవార్త

కార్తీక మాసాన్ని హిందూవులందరూ అత్యంత పవిత్రమైన మాసంగా భావిస్తూ ఉంటారు. శివకేశవులకు సైతం అత్యంత ప్రీతిపాతమైన మాసంగా గురించి ఎంతో విశిష్టంగా చెబుతూ ఉంటారు.ప్రతి ఎడాది మాదిరిగానే ఈ ఎడాది కూడా పంపనూరు శ్రీ సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అలయ కమిటీ అత్యంత వైభవంగా కన్నుల పండుగగా కార్తీక కోటి దీపోత్సవాన్ని నిర్వహిం చారు.ఉదయం నుంచి స్వామి వారికి సుబ్రభాత సేవలతో మొదలుకొని ప్రత్యేక పూజలు జరిపారు.కోటి దీపోత్సవం కార్యక్రమంను రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీమంత్రి పరిటాల సునీత,ఆర్‌డిఓ కేశవనాయుడు,డిఎల ్డిఓ సుమన జయంతి,ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ దీపం జ్ఞానానికి చిహ్నం,వెలుగు అభివృద్ధికి మార్గం,అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి సమాజాన్ని విజ్ఞానం దిశగా జాగృతం చేయడమే దీపానికి లక్షణం అన్నారు. దీపాన్నిపరబ్రహ్మస్వరూ పంగా, మనోవికాసానికి, అనందానికి,సద్గుణ సంప త్తికి నిదర్శమన్నారు.ఏ ఇంటిలో దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీ మహాలక్ష్మి ప్రవేశిస్తుందని పురాణాలు తెలుపుతున్నాయన్నారు.ఈ కోటి దీపోత్సవ కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు భారీగా పాల్గొని దీపాలను వెలగించారు.కార్తీక కోటి దీపోత్సవం అట్టహాసంగా సాగింది.దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు అధికారులు ఏలాంటి అసౌకర్యం కల్గుకుండా తగిన చర్యలు తీసుకున్నారు.స్థానిక ఎస్ఐ లక్ష్మినారాయణ పంపనూరులో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మినరసింహ,తహశీల్దార్ లక్ష్మినాయక్,ఈఓఆర్డీ కామాక్షి శైలజ రాణి,టిడిపి మండల ఇంఛార్జ్ ధర్మవరపు బాలాజీ,హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి,మండల కన్వీనర్ శ్రీనివాసులు,మాజీ సర్పంచ్ పద్మావతి,అధికారులు ఆనంద్,సదాశివ,కార్యదర్శులు మహబూబ్ భాషా,శిరీష,మూకాంభికసాంబ,చంద్రశేఖర్,మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవంలో దీపాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం,టిడిపి నాయకులు

దీపాలును వెలిగిస్తున్న భక్తులు

బాలల చట్టాలు బాలల హక్కుల వారోత్సవాలు

అనంతపురం కల్చరల్, నవంబర్ 17 ప్రభాతవార్త

బాలల హక్కుల పరిరక్షణ కొరకు బాలల చట్టాలు బాలల హక్కుల వారోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం మహిళా, శిశు సంక్షేమ శాఖ శ్రీ సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుధా వరలక్ష్మి ఆదేశాల ను, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ ఆదేశాలను అనుసరించి బుక్కపట్నం కస్తూర్బా బాలికల పాఠశాలలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా పిల్లలకు బాల్య వివాహాలు వలన జరిగే అనర్థాలు, అమ్మాయి చదువు ఆవశ్య కత అంశాలపై అవగాహన కల్పించడం, పిల్లలకి యోగ ఆసనాలు చేయిం చడం జరిగింది. ఈ కార్యక్రమ ంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం న ఉంచి సోషల్ వర్కర్ వనజాక్షి, ఔట్రీచ్ వర్కర్ లక్ష్మి ప్రసన్న, పాఠశాల ప్రిన్సిపాల్, పాటశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సామాజిక సేవకు గుర్తింపుగా డాక్టరేట్ అందుకున్న దీపక్ దయానంద్

- దీపక్ దయానంద్ సేవలకు గుర్తింపుగా డాక్టరేట్‌ప్రధానం

అనంతపురం కల్చరల్, నవంబర్ 17 ప్రభాతవార్త

ప్రముఖ న్యాయవేత్త, సామా జిక కార్యకర్త దీపక్ దయానందన్ తన అద్భుతమైన సేవలకు గుర్తిం పుగా ఆమెరికన్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్‌ను అందు కున్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తు న్న దీపక్ దయానందన్, 2008 నుంచి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న దీపక్, తన చట్టపరమైన జ్ఞానాన్ని, సామాజిక కోరికను కలిపి అనేక మంది జీవితాలను మార్చారు. విద్యా ప్రోత్సాహం, అణగారి వర్గాలకు న్యాయ సహాయం వంటి వివిధ సామాజిక చొరవలకు నాయకత్వం వహిస్తున్నారు. బాస్ ఫౌండేషన్ ద్వారా పేదరిక ని ర్మూలన, యువత సాధికారత, ఆరోగ్య సంరక్షణ వంటి అనేక కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. మానవ సేవ మాధవ సేవ అనే నమ్మకంతో తన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీపక్‌కు ఈ అవార్డు లభించడం ఆయన కృషికి ఒక గుర్తింపు మాత్రమే కాదు, ఇతరులకు స్ఫూర్తి కూడా, ఆయన కథ మనందరికీ సమాజ సేవ యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది.

: డాక్టరేట్ అందుకుంటున్న దీపక్ దయానంద్

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు, మొండి బకాయిల సాధన కొరకై ఉద్యమ కార్యచరణ ప్రకటించిన - ఎపిటిఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 17 ప్రభాతవార్త

ఏపిటిఎఫ్ అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అధ్యఓతన ఉపాధ్యాయ భవనం, అనంతపురంలో నిర్వహించడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసనాయక్ ఆహ్వానంతో కార్యక్రమం మొదలైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పూర్వ ప్రధాన కార్య దర్శి కులశేఖర్‌రెడ్డి హాజరవ్వడం జరిగింది. జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా మహాసభలు, రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసినందుకు జిల్లా రాష్ట్ర మండల నాయకులకు ఉద్యమా భివందనాలు తెలియజేయడం జరిగింది. మండలాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా గౌరవాధ్యక్షులు వరప్ర సాద్, పూర్త రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లా పూర్త అధ్యక్షులు రవీంధ్ర, జిల్లా అదనపు కార్యదర్శి ఆంజినేయులు నాయక్, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ అశోక్ నాయక్, జిల్లా ఉపాధ్య క్షులు వజీర్ భాష, ఉపాధ్యక్షులు రామాంజనే యు లు, రాష్ట్ర కౌన్సిలర్ నరసిం హులు, రాష్ట్ర కౌన్సిలర్ ఫకృద్దీ న్ (బెలుగుప్ప) బెలుగుప్ప మండల ప్రధాన కార్యదర్శి హుస్సేన్ పీరా, మున్సిపల్ శాఖ నుంచి అధ్య క్షులు నారాయణ నాయక్, తిరుపాల్ నాయక్, ఆత్మకూరు శాఖ నుంచి మల్లీ నాథ్, పుట్లూరు ప్రధాన కార్య దర్శి రాజేంద్ర ప్రసాద్, పామిడి ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, అల్లా బకాష్ (పామిడి), గుత్తి మండల శాఖ నుంచి మస్తాన్ వలి, కళ్యాణదుర్గం మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, అధ్యక్షులు ఆదినారాయణ, గోవిందరెడ్డి, పెద్దపప్పూరు మండల అధ్యక్షులు గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.